గాంజా.. గ్యాంగ్స్..

పార్కులు, చెట్ల పొదలు, చెరువులే కేంద్రాలు

గుప్పుగుప్పుమంటూ గంజాయి పీలుస్తూ.. వదులుతూ.. యువత ఎంజాయ్ చేస్తున్నారు. సాయంత్రం అయ్యిందంటే గుంపులుగా నిర్మానుష్య ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. అంతా కలిసి గంజాయి పీల్చడం సరదాగా మొదలుపెట్టి బానిసలుగా మారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. అక్రమంగా డబ్బులు సంపాదించేందుకు కొంతమంది అక్రమార్కులు యువతను లక్ష్యంగా చేసుకొని మొదట్లో గంజాయిని ఫ్రీగా ఇస్తున్నారు. వారు అలవాటు పడిన తర్వాత అధిక ధరలకు విక్రయించి డబ్బులు గడిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నా చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉంది. – రామంతాపూర్

- సాయంత్రం మూసీ ప్రాంతాల్లో వాలుతూ..
- రకరకాల మార్గాల్లో గంజాయి అమ్మకాలు
- బానిసలుగా మారిపోతున్న యువకులు
- ఇటీవల రామంతాపూర్‌లో గంజాయి చాక్లెట్లు


రామంతాపూర్ గాంధీనగర్‌లో గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

రామంతాపూర్ పరిధిలో మూసీ ప్రాంతం విస్తరించి ఉండటం, నిర్మానుష్య ప్రాంతాలు అధికంగా ఉండటం, చెట్ల పొదలను యువత గంజాయి అడ్డాలుగా మార్చుకున్నారు. స్నేహితులతో కలిసి సరదాగా అటువైపు వెళ్తూ గంజాయి మత్తుకు చిత్తవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వాలిపోతున్న యువతకు వివిధ మార్గాల్లో అక్రమార్కులు గంజాయి సరఫరా చేస్తున్నారు. పోలీసులు ఎన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నా.. గంజాయి విక్రయదారులు సవాల్ విసురుతున్నారు. గంజాయి విక్రయించే వారు పలువురి ద్వారా పోలీసుల కదలికల సమాచారం సేకరించి జాగ్రత్త పడుతున్నారు. కొంతమంది అక్రమార్కులు లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు అన్ని రకాలుగా కట్టడి చేసి యువత జీవితాలు నాశనం కాకుండా గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

34 కేజీల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

మేడ్చల్ జిల్లా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి గత నెల 27న రామంతాపూర్ గాంధీనగర్‌లోని ఓ కిరాణా షాప్‌పై దాడి చేసి గంజాయితో తయారు చేసిన 34 కిలోల చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ చాక్లెట్లను రామంతాపూర్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు ఉప్పల్ పారిశ్రామికవాడల్లో కూడా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.

ఎక్కడెక్కడ..?

రామంతాపూర్ పరిధిలోని చిన్న చెరువు వాకింగ్ ట్రాక్, శ్మశానవాటిక ప్రహరీగోడ, గోఖలేనగర్‌లోని బృందావన్ పార్కు, రాంరెడ్డినగర్ నుంచి ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లే ఔట్ రోడ్డులో.. రామంతాపూర్ భగాయత్ మూసీ పరివాహక ప్రాంతాలైన బఫర్ జోన్‌తో పాటు ఉప్పల్ పారిశ్రామిక వాడలో గంజాయి విక్రయాలు, సేవించే కేంద్రాలుగా మారాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతాల్లో గంజాయి సేవించడానికి స్థానిక యువకులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వస్తుంటారని చిన్న చెరువు వాకింగ్ ట్రాక్‌లో రాత్రయితే గుంపులు గుంపులుగా చేరి గంజాయి సేవిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ ప్రాంతాలకు పెట్రోలింగ్‌కు వచ్చినప్పుడు తప్పించుకుని పారిపోతున్నారని, గంజాయి విక్రయదారులను అదుపులో పెట్టడానికి ఈ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఎక్కువసార్లు పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన శిబిరాలు నిర్వహిస్తాం



గంజాయి సేవిస్తే కలిగే అనర్థాలపై యువతకు నిపుణులచే అవగాహన కల్పిస్తాం. అదేవిధంగా ట్రాఫిక్ సైబర్ నేరాలపై కళాశాలలు, స్కూళ్లలో పోలీసు విభాగం నిర్వహిస్తున్న అవగాహన శిబిరాల మాదిరిగానే గంజాయితో ఎదురయ్యే పరిణామాలపై స్థానిక యువతకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాను.
– బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కార్పొరేటర్

పిల్లలపై పర్యవేక్షణ ఉండాలి



తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ కలిగి ఉండాలి. చిన్నారులు చాక్లెట్ల కోసం తరచూ డబ్బులు అడుగుతుంటే పదే పదే చాక్లెట్లు తింటుంటే తల్లిదండ్రులు వారిని కనిపెట్టాలి. వారు తినే చాక్లెట్లను పరిశీలించాలి. కొందరు దుర్మార్గులు గంజాయి చాక్లెట్లను రూ.5 కు పిల్లలకు విక్రయిస్తూ వారికి అలవాటు చేస్తున్నారు.
– గడ్డం వెంకట్‌సాయి, రామంతాపూర్

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు..


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

మల్లాపూర్: ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు కృషి చేయాలని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నాచారం స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్స్ శివకుమార్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఐసీడీఎస్ సీడీపీవో స్వాతి

జవహర్‌నగర్: మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రై సంస్థ సహకారంతో మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని గబ్బిలాల్‌పేట, రాజీవ్‌గాం, దీనగర్, శాంతినగర్‌లో కళాజాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో స్వాతి మాట్లాడుతూ.. ప్రతి మహిళ గర్భం దాల్చిన వెంటనే స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పౌష్టికాహార లోపం లేని పిల్లల ఎదుగుదలకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో క్రై సంస్థ సిబ్బంది మంజుల, సునీల్, సందీప్, అంగన్‌వాడీ టీచర్, క్రాంతి కళాబృందం సభ్యులు వెంకటచారి, ఆంజనేయులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి పత్రాలు సమర్పించాలి

రామంతాపూర్: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలులో భాగంగా ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ బస్తీలు, కాలనీల్లో ఉన్న అర్హులైన వారికి ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ పొందడానికి మీటర్ రీడింగ్ వచ్చే విద్యుత్ సిబ్బందికి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు సమర్పించాలని ఉప్పల్ విద్యుత్ ఏడీఈ బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వారు కూడా ఈ పథకానికి అర్హులని, వారు కూడా పత్రాలను సమర్పించి ఉచిత విద్యుత్ పొందాలని కోరారు.

విమలాగద్దర్‌కు అవార్డు అభినందనీయం

అల్వాల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ సతీమణి గుమ్మడి విమలాగద్దర్ మాతా రమాబాయి అంబేడ్కర్ అవార్డుకు ఎంపికవడం అభినందనీయమని గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు సీఎల్.యాదగిరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటం చేసిన గద్దర్‌కు ఆయన సతీమణి విమలాగద్దర్ ఎంతో సహకారం అందించింది. ఆమె త్యాగాలు తెలుసుకున్న అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ త్యాగానికి ప్రతీకైన మాత రమాబాయి అంబేడ్కర్ అవార్డుకు ఎంపిక చేశారన్నారు.

సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాణినగర్ కాలనీవాసులు

గౌతంనగర్: వాణినగర్ కాలనీలో సీసీ రోడ్లు, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం వాణినగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఆయన స్పందించి సంబంధిత అధికారులకు తెలియచేశారు. కాలనీవాసులు సిద్ధయ్య, బలరాం, నర్సింగ్‌రావు, రఘునాథ్, కామేశ్వర్‌రావు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంలో ఔత్సాహికులకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న ఎన్ఎస్ఐసీ సెంటర్ ఎస్.కె.సుబ్రమణి

కాప్రా: ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో అనేక ప్రోత్సాహకాలను అందిస్తోందని, అవకాశాలను యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఐసీ సెంటర్ ఎస్.కె.సుబ్రమణి సూచించారు. ఏఎస్‌రావునగర్‌లోని ఎన్ఎస్ఐసీ సెంటర్‌లో ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామిక వేత్తల కోసం ఎన్ఎస్ఐసీ, ఎంఎస్ఎంఈ, నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్, ఎమర్జింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ స్టార్టప్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. అనంతరం ఎమర్జింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ స్టార్టప్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ కేబీ వెంకట్ మాట్లాడుతూ.. మొదటిసారి వ్యాపార రంగంలోకి రావాలనుకునే వారికి తమ సంస్థ సహకారం అందించి సలహాలు, సూచనలు ఇస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్‌హెచ్‌ఓ హెడ్ సురేష్, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ డీజీఎం డాక్టర్ జయేష్‌కుమార్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సీఎం ఏకే రాజు, వినోద్‌బాబు, జీఈఎం ఫెసిలిటేటర్ రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానసరస్వతీ ఆలయంలో పూజలు



మల్కాజిగిరి: అనంత సరస్వతీ నగర్‌లోని జ్ఞాన సరస్వతీ దేవాలయంలో మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మూల విరాట్‌కు విశేష అభిషేకం, అలంకరణ, అర్చన, ఛండీహోమం, సామూహిక అక్షరాభ్యాసం తదితర పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకులు రాజశేఖరశర్మ, అర్చకులు సాయి, గురురాజ్ నిర్వహించారు.

ఆర్థిక సాయం



మల్కాజిగిరి: అనారోగ్యంతో మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐఎన్‌నగర్‌కు చెందిన వినోద్‌కుమార్‌ను బీజేపీ రాష్ట్ర సంయుక్త కోశాధికారి విజయ్‌సురానా పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భగవాన్ మహావీర్ డయాలసిస్ సెంటర్ ద్వారా నగరంలో ఏడు సెంటర్లు ఏర్పాటు చేసి నిరుపేదలకు డయాలసిస్ సేవలు అందిస్తున్నామన్నారు. మల్కాజిగిరి ప్రాంతంలో కూడా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

సమ్మెకు సహకరించాలి


కాప్రా సర్కిల్ డీసీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నేతలు

కాప్రా: ఈ నెల 16న కార్మిక సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త బంద్‌కు సహకరించాలని బీఆర్‌టీయూ యూనియన్ కాప్రా సర్కిల్ అధ్యక్షుడు కురుమన్న కోరారు. ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మెకు సహకరించాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు జాను, మిరియాల సాయిలు, శివయ్య, శివబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు సహాయపడుతున్న కాంగ్రెస్ నేతలు

రామంతాపూర్: ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా పొందడానికి మంగళవారం కాంగ్రెస్ పార్టీ రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ రఫిక్ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ అర్హులైన పేదలకు ఉచిత విద్యుత్ అందేవిధంగా అవగాహన కల్పించారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలను విద్యుత్ సిబ్బందికి అందించి లబ్ధిదారులకు సహాయపడ్డారు. సందీప్, ఆదినారాయణ, గణేష్, సూర్య, సుధాకర్, మధు, స్వామి తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ విష్ణుపురి కాలనీ సినీపోలీస్ నుంచి మేఘనా అపార్ట్‌మెంట్స్ వరకు సీసీ రోడ్డు పునర్‌నిర్మాణం, రాజీవ్‌గాంధీ నగర్ ఆర్‌యూబీ నుంచి గౌతమ్ స్కూల్ వరకు స్ట్రాం వాటర్ నాలా నిర్మాణం, ఆర్‌కేనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ నుంచి రమేష్ ఆస్పత్రి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిధులు అడిగినట్లు చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

చకచకా గుర్రపు డెక్క తొలగింపు పనులు


గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ కొత్త చెరువులో పేరుకు పోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను మంగళవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త చెరువు సుందరీకరణకు ప్రణాళికలు రూపొందిస్తానన్నారు. దోమల నివారణ, డెంగ్యూ, మలేరియా రోగాల నుంచి ప్రజలను రక్షించేందుకు, దుర్వాసన సమస్యను పరిష్కరించేందుకు చెరువులో గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు మల్లేష్‌గౌడ్, సంజీవరెడ్డి, వీఎస్.రాజు, పెద్ది రమేష్, ప్రేమ్‌కుమార్, మల్లేష్, లింగారెడ్డి, రహమత్‌ఖాన్, అప్సర్ పాల్గొన్నారు.

పల్లెకు పోదాం.. బస్తీలో ఉందాం..


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు రాష్ట్రంలో డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం రాత్రి చర్లపల్లిలో నిర్వహించిన పల్లెకు పోదాం.. బస్తీలో ఉందాం కార్యక్రమంలో పాల్గొని రాత్రి అక్కడే బస చేశారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అన్ని వర్గాల ప్రజలు, యువకులతో మమేకమై మోదీ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. నమో యాప్‌లను డౌన్‌లోడ్ చేయించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం బయట పడుతున్న అవినీతి అధికారులంతా మాజీ మంత్రి కేటీఆర్ ఉన్న పురపాలక, ఐటీ శాఖలకు చెందినవారే అన్నారు. పదిరోజులు ఒకసారి ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లేది రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని కేవలం అధిష్టానానికి కప్పం కట్టి, రాహుల్ యాత్రకు సౌకర్యాలు కల్పించడం కోసమని విమర్శించారు. బీజేపీ నాయకులు నాదం, నర్సింగ్‌రావు, లక్ష్మణ్‌గౌడ్, చల్లా ప్రభాకర్, వెంకులు, నాగమణి, పవన్ కుమార్, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

సీఎంపై అసత్య ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు


ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉప్పల్: సోషల్ మీడియాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా మేసేజ్‌లు పంపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉప్పల్ సర్కిల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ నేతలు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డికి అందజేశారు. ఉప్పల్ భరత్‌నగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ ముఖ్యమంత్రిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, చిలుకానగర్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బస్తం శ్రీరాములు, బాకారం అరుణ్, అలుగుల అనిల్ కుమార్, అల్వాల భాస్కర్, తోకట రాజు, అన్వర్ పాషా, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి


దేశవ్యాప్త బంద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

కాప్రా: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని పార్టీ కార్యాలయం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో మంగళవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను కేంద్రం అవలంబిస్తోందని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పరిపాలన అధికారాలను పూర్తిగా దుర్వినియోగం చేస్తోందని, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. సీపీఐ నాయకులు ఉమామహేష్, శంకర్‌రావు, శంకర్, కృష్ణమూర్తి, హరనాథ్‌రావు, స్వామి, కిషన్, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నకిలీ టీపొడి తయారు చేస్తున్న ఇద్దరి అరెస్టు

అల్వాల్: గుట్టుచప్పుడు కాకుండా నకిలీ టీపొడి తయారు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన పరీష్, బాలానగర్‌కు చెందిన పద్మ అల్వాల్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా నకిలీ టీపొడి తయారు చేస్తూ స్థానికంగా ఉన్న టీ సెంటర్లకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి రెండు క్వింటాళ్ల టీ పొడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఓడించినా బుద్ధిరాలేదు

మేడిపల్లి: సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను ఉప్పల్ డిపో ఎదురుగా మంగళవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. ప్రజలు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించినా బుద్ధి రాలేదని, బీఆర్‌ఎస్ నాయకులు చేసిన అవినీతిని పక్కదారి పట్టించడానికే సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయించిన కేటీఆర్ తమ వక్రబుద్ధికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్త సుశాంత్ గౌడ్, పీఎంసీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, ప్రభాకర్‌రెడ్డి, దర్గా సుధాకర్‌రెడ్డి, జంగాచారి, రంజిత్‌రెడ్డి, పవన్‌గౌడ్, మణిరాం నాయక్, మజర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

మల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ నాచారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బందారం శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నాచారం వైజయంతి చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్‌ఆర్.మోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, రాంరెడ్డి, బండారి రఘు, రాజు, భద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి, రమేష్‌గౌడ్, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, గద్ద క్రాంతి, నరేందర్ యాదవ్, నమిలి కొండ సునీల్ రెడ్డి, వెంకటేష్‌గౌడ్, టోని, బాలు యాదవ్ పాల్గొన్నారు.


నాచారం వైజయంతి చౌరస్తాలో..

అల్వాల్‌లో కార్డెన్ సెర్చ్



అల్వాల్: అల్వాల్, మచ్చ బొల్లారం, గోపాల్‌నగర్‌లో మంగళవారం రాత్రి పేట్‌బషీరాబాద్ డివిజన్ ఏసీపీ సీహెచ్.రఘునందన్‌రావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అల్వాల్, పేట్‌బషీరాబాద్, శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఆర్టీసీ ఉద్యోగి మృతి

ఉప్పల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్టీసీ ఉద్యోగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీర్జాదిగూడ ప్రాంతానికి చెందిన గైక్వాడి సంతోష్‌రాజ్(53) ఆర్టీసీ బర్కత్‌పురా డిపోలో హెడ్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గత నెల 31వ తేదీన విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఉప్పల్ డీఎస్‌ఎల్ మాల్ వద్దకు చేరుకోగానే కింద పడటంతో గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హిందీ క్వశ్చన్ ఫోరమ్ కాంపిటీషన్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ ప్రాంగణంలో అధికార భాష కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హిందీ క్వశ్చన్ ఫోరమ్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్‌పీఎఫ్ డీఐజీ జీసీ అనిల్‌మింజ్ హాజరై మాట్లాడుతూ.. హిందీ భాషను అర్థం చేసుకుంటే సులువు అన్నారు. ప్రతి ఒక్కరూ హిందీలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జీసీ సంతోష్‌కుమార్, రాజేష్‌కుమార్, శ్యామ్‌సుందర సాహు పాల్గొన్నారు.

రోగులు, వైద్యులకు వారధిలా మెడిలాంజ్

సాక్షి, సిటీబ్యూరో: ఉన్న చోట నుంచే వేర్వేరు ప్రాంతాల వైద్య నిపుణుల సేవలను పొందడంలో రోగులకు సహకరించే అనుసంధానిత టెలీకన్సల్టేషన్ వేదిక మెడిలాంజ్ నగరంలో ఏర్పాటైంది. ఎమ్‌క్యూరా మొబైల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎ.ఎస్.రావునగర్‌లో నెలకొల్పిన ఈ లాంజ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్ క్యూరా వ్యవస్థాపక సీఈఓ మధు బాల రాధాకృష్ణన్ మాట్లాడుతూ రోగుల పూర్తి కేస్ షీట్‌ను తయారు చేయడం, ముందస్తు అసెస్‌మెంట్ సేవలు, ఐఓటీ–ఆధారిత తక్షణ పరీక్షలు తదితర సేవల్ని తమ మెడిలాంజ్ అందిస్తుందని తెలిపారు. ఇది వైద్యులకు–వైద్యులకు మధ్య, రోగులకు–వైద్యులకు మధ్య సంప్రదింపులను సులభ సాధ్యం చేయడం ద్వారా అత్యాధునిక వైద్య సేవలు పొందంలో సంక్లిష్టతను నివారిస్తుందన్నారు. స్థానిక పాలిక్లినిక్స్, మధ్య స్థాయి ఆస్పత్రులకు ఒక వరంలా సమగ్ర వ్యాధి నిర్వహణ లక్ష్యంగా మెడిలాంజ్ పని చేస్తుందన్నారు.

జీవన నైపుణ్యాలపై యువత దృష్టిసారించాలి


జీవన నైపుణ్యాలపై ఉపన్యసిస్తున్న మాజీ అదనపు డీజీపీ బాబూరావు

కీసర: యువత జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని మాజీ అదనపు డీజీపీ బాబూరావు అన్నారు. బోగారంలోని హోలీ మేరీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌లో జీవన నైపుణ్యాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో యువకులు దూసుకెళ్లాలంటే జీవన నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంచుకున్న రంగంలో లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రతిభతో పాటు సమయ స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ అరిమండ సిద్ధార్థరెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.